నమస్తే తెలంగాణ
# జనగామ
5 | వరంగల్, ఆదివారం 25 మే 2025 | JANAGAON



మాజీ ఎమ్మెల్యే రాజయ్యను శాలువాతో సన్మానిస్తున్న కేటీఆర్

## కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, మే 24 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులను కేటీఆర్‌కు వివరించారు. అలాగే ఇటీవల ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కావడంపై కేటీఆర్‌ను అభినందించగా మీ అందరి కృషి వల్లే సభ సక్సెస్ అయిందని శాలువాతో సన్మానించినట్లు రాజయ్య తెలిపారు.

## ■ గోదావరికి వరదొచ్చింది..



పూసూరు వద్ద కొత్త నీరుతో ప్రవహిస్తున్న గోదావరి

మే నెల చివరి వారంలోనే గోదావరికి వరదొచ్చింది. ములుగు జిల్లాలోని వాజేడు మండలంతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో కొత్త నీరు చేరడంతో పేరూరు, వాజేడు, పూసూరు, ఎడ్జర్లపల్లి గ్రామాల మీదుగా గోదావరి ప్రవహిస్తున్నది. దీంతో పూసూరు వద్ద ఉన్న బ్రిడ్జిపై నుంచి వెళ్లే వాహనదారులు వరద ప్రవాహాన్ని వీక్షించడంతో పాటు గోదావరి అందాలను తమ సెల్ ఫోన్లలో బంధిస్తున్నారు.

– వాజేడు, మే 24

## నేడు యూపీఎస్సీ సివిల్స్ పరీక్ష

- హనుమకొండలో 10 కేంద్రాలు.. 4,141మంది అభ్యర్థులు
- అన్ని ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్ ప్రావీణ్య



హనుమకొండ, మే 24 : నేటి యూపీఎస్సీ సివిల్ సర్వీస్ ప్రిలిమ్స్–2025 పరీక్షకు సర్వం సిద్ధమైంది. ఈమేరకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాటుచేసింది. ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30గంటల వరకు రెండు పూటలా నిర్వహించే ఈ పరీక్ష కోసం హనుమకొండ జిల్లాలో 10 కేంద్రాలు కేటాయించగా 4,141 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి అరగంట ముందే కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఉదయం పరీక్షకు 8గంటల నుంచి, మధ్యాహ్నం పరీక్షకు ఒంటి గంట నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. ఉదయం 9గంటల తర్వాత, మధ్యాహ్నం 2 తర్వాత అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించరు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, పెన్ను, పెన్సిల్‌తో పాటు అందులో పేర్కొన్న గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక కార్డును వెంట తెచ్చుకోవాలి. ఎగ్జామ్ సెంటర్‌లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దు. చేతి గడియారాలు కూడా అనుమతించరు. పరీక్ష నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేశామని అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ ప్రకటనలో సూచించారు.

**పరీక్షా కేంద్రాలివే..**

హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సబ్ సెంటర్–ఎ, సబ్ సెంటర్ –బి, హంటర్‌రోడ్డులోని మాస్టర్జీ పీజీ అండ్ డిగ్రీ కళాశాల, న్యూసైన్స్ డిగ్రీ కళాశాల, అడ్వకేట్స్‌కాలనీ రోడ్డు నెంబర్–1 లోని ఎస్ఆర్ నేషనల్ హైస్కూల్, వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ కళాశాల(మహిళలు), పెద్దపెండ్యాల్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, భద్రకాళీ ఆలయం వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కాలేజీ, అశోక థియేటర్ వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష నిర్వహించనున్నారు.

### సెంటర్ల వద్ద 163 సెక్షన్ అమలు : సీపీ సన్‌ప్రీత్‌సింగ్

సుబేదారి, మే 24 : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం నిర్వహించే యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమనరీ పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 5 వరకు బీఎన్ఎస్ఎస్–163 సెక్షన్ అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రాలకు 500 మీటర్ల దూరంలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలు, ఊరేగింపులకు అనుమతి లేదని, చుట్టుపక్కల ఉన్న ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆయన ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



రహదారిపై భారీగా నిలిచిన వాహనాలు



త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరిస్తున్న భక్తులు



పుణ్యస్నానం ఆచరిస్తూ స్వామివారికి నమస్కరిస్తున్న భక్తులు



నదిలో బోనం సమర్పిస్తున్న శివసత్తి

# పదో రోజు పోటెత్తారు

## సరస్వతీ పుష్కరాలకు పుష్కలంగా భక్తజనం

- రద్దీ పెరగడంతో కోలాహలంగా కాళేశ్వరం
- వివిధ ప్రాంతాల నుంచి 5లక్షలకు పైగా రాక
- 10 కిలోమీటర్లు దాకా ట్రాఫిక్‌జామ్
- వాహనాలు ముందుకు కదలక నరకయాతన
- త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు
- కాళేశ్వరానికి నేడు గవర్నర్ రాక

మహదేవపూర్ (కాళేశ్వరం) మే 24 : సరస్వతీ పుష్కరాల పదో రోజు కాళేశ్వరానికి భక్తజనం పోటెత్తారు. ఈ నెల 15న ప్రారంభమై మరో రెండు రోజుల్లో ముగియనుండడంతో తెలంగాణ సహా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో త్రివేణి సంగమం కోలాహలం మారింది. శనివారం ఒక్కరోజే సుమారు 5లక్షలకు పైగా భక్తులు వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. సరస్వతీ(వీఐపీ) ఘాట్ వద్ద త్రివేణి సంగమంలో మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి పుణ్యస్నానం ఆచరించి చీరె, సారె సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల రద్దీతో గోదావరి కిటకిటలాడింది. ఇక స్వామివారి దర్శనానికి భక్తులకు గంటల సమయం పట్టింది. పలువురు భక్తులు క్యూలైన్‌లో సొమ్మసిల్లి పడిపోగా, వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. ఆలయ ఆవరణలో విధులు నిర్వర్తిస్తున్న ఓ హోంగార్డ్‌కు ఫిట్స్ వచ్చి కిందపడిపోయాడు. అక్కడే ఉన్న ఫైర్‌అండ్ రెస్క్యూ సిబ్బంది దవాఖానకు తరలించారు.



బస్సుల కోసం వేచి చూస్తున్న భక్తులు

### 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

సరస్వతీ పుష్కరాలు మరో రెండు రోజుల్లో ముగియనుండడంతో భక్తులు ప్రైవేట్ వాహనాల్లో కాళేశ్వరానికి చేరుకుంటున్నారు. దీంతో కాళేశ్వరం నుంచి సుమారు 10 కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామైంది. చాలా మంది భక్తులు ట్రాఫిక్‌లో ఇరుక్కొని నరకయాతన పడ్డారు. క్షేత్రానికి వచ్చే వాహనాలను మూడు కిలోమీటర్ల ముందే నిలిపివేయడంతో భక్తులు అక్కడి నుంచి కాలినడకన ఆలయానికి చేరుకున్నారు.



ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన అంబులెన్స్

### రద్దీకి తగిన ఏర్పాట్లు లేవు..



సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీకి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేయలేదు. భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుండడంతో కాలినడకన కిలోమీటర్ నడవాల్సి వస్తున్నది. సూచికబోర్డులు లేకపోవడంతో ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి. అధికారులు ఎప్పటికప్పుడు తగినట్లు ఏర్పాట్లు చేస్తే బాగుండేది.

– విజయ్‌కుమార్, భక్తుడు, భీమారం

### ఈ రెండు రోజులే కీలకం : కలెక్టర్ రాహుల్ శర్మ



క్యూలో నిల్చున్న భక్తులు

సరస్వతీ పుష్కరాలకు ఈ రెండు రోజులే కీలకమని, లక్షల్లో భక్తులు వచ్చే అవకాశమున్నందున యంత్రాంగం నిత్యం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. పుష్కరాల ఏర్పాట్లను పరిశీలించి, రానున్న రెండు రోజులు చేపట్టాల్సిన చర్యలపై వాకీటాకీ ద్వారా దిశానిర్దేశం చేశారు. మెయిన్ ఘాట్ నుంచి సరస్వతీ ఘాట్ వరకు ఏర్పాటు చేసిన మట్టి రోడ్డులో వరద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించాలన్నారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయానికి చేరుకొని, భక్తుల రద్దీని పరిశీలించి పుష్కరాల సేవలు ఏవిధంగా ఉన్నాయని భక్తులను అడిగి తెలుసుకున్నారు. పలుగుల జంక్షన్, తాత్కాలిక బస్టాండ్, ఇప్పలబోరు జంక్షన్, పార్కింగ్ స్థలాలను పరిశీలించి, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పోలీసులతో మాట్లాడారు. ట్రాఫిక్ జామ్ కాకుండా వాహనదారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. భక్తుల రద్దీ పెరుగుతున్నందున అత్యవసర వైద్య సేవలకు అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం త్రివేణి సంగమంలో పడవలో ప్రయాణించి రక్షణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా, సరస్వతీ పుష్కరాలకు ఆదివారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రానున్నట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

### ట్రాఫిక్‌తో ఇబ్బందిపడ్డాం..



టేకుమట్ల : భక్తుల రాకను అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారు. అధికారుల మధ్య సమన్వయ లోపంతో ట్రాఫిక్‌లో ఇరుక్కొని ఇబ్బంది పడ్డాం. నియంత్రించాల్సిన పోలీసులు చెట్ల కిందే సేదతీరడం దారుణం. కొందరు భక్తులే వాహనాలు దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేయాల్సి వచ్చింది. వృద్ధులు, చిన్నారులకు తాగునీరు అందక నరకయాతన పడ్డారు. చాలా మంది వాహనాలను వదిలి 10కిలోమీటర్ల మేర నడుచుకుంటూ ఆలయానికి చేరుకున్నారు.

– నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, భక్తుడు, బోయినపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా



ట్రాఫిక్‌ను క్లియర్ చేయాల్సిన పోలీసులు విధులను మరిచి చెట్ల కింద ఉన్న దృశ్యం




నదిలో పూజలు చేస్తున్న మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ



ఫిట్స్ తో కిందపడిపోయిన హోంగార్డుకు సపర్యలు చేస్తున్న సిబ్బంది



బోట్ షికారు చేస్తున్న భక్తులు



# రౌడీ రాజ్!

## వరంగల్ తూర్పులో నవీన పోలీసింగ్

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అతడో రౌడీ 'రాజ్'. పోలీసు వ్యవస్థను శాసిస్తూ, తన దందాలు, దౌర్జన్యాలకు పోలీసులనే ప్రైవేట్ సైన్యంలా వాడుకుంటూ 'నవీన' పోలీసింగ్ నడిపిస్తున్నాడు. ఇక్కడ పోలీసులకు పోస్టింగ్ కావాలన్నా.. వారు డ్యూటీలు చేయాలన్నా అతడిని సంప్రదించాల్సిందే. అతడు చెప్పిన వారే ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, ఎస్సై విధుల్లో ఉంటారు. అతడు చెప్పిందే తడవుగా 'జీ హుజూర్' అంటూ వంగి సలాం కొడుతారు. అతడు సైగ చేస్తే దందాలు.. సెటిల్‌మెంట్లు చక్కబెడతారు. ప్రత్యర్థులపై తప్పుడు కేసులు నమోదు చేస్తారు. అతడికి గాడ్‌ఫాదర్‌గా ఉన్న వయోభారం, అనారోగ్యంతో జనాల్లో తిరగలేని ఓ అధికార పార్టీ ముఖ్యనేత. ఇదే రౌడీ రాజ్‌కు కలిసి వచ్చింది. పోలీసులను శాసిస్తూ శాంతి భద్రతలను తన కంట్రోల్‌లోకి తెచ్చుకున్నాడు. ఇందుకు ఓ ఉన్నతాధికారి సహకారాలందిస్తుంటే ఇతరులు స్వామి భక్తిని ప్రదర్శిస్తున్నారు. వీరిద్దరిపై ప్రజాప్రతినిధులు ఫిర్యాదులు చేసినా, ఇంటెలిజెన్స్ వర్గాల నివేదికలు అందినా ఉన్నతాధికారుల చర్యలు శూన్యం. హోం శాఖను తన చేతిలో పెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డి కూడా పట్టించుకోకపోవడంతో వారి అరాచకాలు మరింత పెరిగిపోతున్నాయి.

- సుబేదారి, మే 24

- అతడు చెప్తేనే పోలీసులకు పోస్టింగ్‌లు.. డ్యూటీలు
- సైగ చేస్తే సెటిల్‌మెంట్లు.. ప్రత్యర్థులపై తప్పుడు కేసులు
- ప్రైవేట్ సైన్యంలా పనిచేస్తున్న నియోజకవర్గ ఖాకీలు
- అధికార పార్టీ నేత అండతో పెరుగుతున్న అరాచకాలు
- పట్టించుకోని ప్రభుత్వ పెద్దలు

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అధికార పార్టీ ముఖ్య నేతకు అనుచరుడిగా ఉంటున్న ఓ రౌడీ రాజ్ అరాచకాలు మితిమీరుతున్నాయి. సామాన్య ప్రజలపై దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. అయితే బాధితులకు అండగా నిలవాల్సిన, రాష్ట్ర పోలీసు శాఖ కంట్రోల్‌లో ఉండాల్సిన ఇక్కడి పోలీసులు అతడి కనుసన్నల్లో పని చేస్తుండడంతో న్యాయం జరగడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొద్ది నెలల క్రితం తనకు సంబంధం లేకున్నా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు వెళ్లిన రౌడీ రాజ్‌కు ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు ఎదురెళ్లి సెల్యూట్ చేసి లోపలికి తీసుకురావడం అప్పట్లో తీవ్ర విమర్శలకు దారితీసింది. రౌడీ రాజ్‌కు సహకరిస్తున్న ఓ పోలీసు అధికారి అతడి వద్దకు వచ్చే బాధితులను 'అన్న (రౌడీ రాజ్)ను కలిశారా? లేదంటే అతడిని కలిసి రండి.. అప్పుడు చూద్దాం' అని చెప్తూ పోలీసు శాఖ పరువు తీస్తున్నాడనే ఆరోపణలున్నాయి.

**కొట్టించడం.. కేసుల్లో ఇరికించడం..**

తూర్పు నియోజవర్గంలో రౌడీ రాజ్ అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. పోలీసులకు పోస్టింగ్‌లు ఇప్పిస్తూ ప్రత్యర్థులను దారిలోకి తెచ్చుకునేందుకు వారితో కొట్టించడం, అప్పటికీ వినకపోతే కేసుల్లో ఇరికించడం చేస్తుంటాడు. వీరి అండతో వివాదాస్పద భూముల్లో తలదూర్చి అమాయక ప్రజల భూములను బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నాడనే ఆరోపణలు కోకొల్లలు. కొద్ది నెలల క్రితం వరంగల్ నగర శివారు స్తంభంపెల్లిలో రూ. 7 కోట్లకుపైగా విలువ చేసే మూడు ఎకరాల సాగు భూమిని బెదిరించి తన సొంతం చేసుకున్నట్లు తెలిసింది. అలాగే వరంగల్ 34వ డివిజన్‌లో అరకోటికిపైగా విలువ చేసే ప్లాట్‌ను తన ఆధీనంలోకి తీసుకున్నట్లు సమాచారం. మిల్స్‌కాలనీ, ఇంతెజార్‌గంజ్, మట్టెవాడ పోలీసు స్టేషన్ల పరిధిలో వివాదాస్పద భూములు, లావాదేవీలను అక్కడి పోలీసు అధికారులు సెటిల్ చేసి రౌడీ రాజ్‌కు ప్రైవేట్ సైన్యంలా పని చేస్తున్నారనే విమర్శలున్నాయి. అలాగే కొద్ది రోజుల క్రితం పోలీసులను అడ్డుపెట్టుకొని చాంబర్ ఆఫ్ కామర్స్ నేతను రౌడీ రాజ్ ఇబ్బందులకు గురిచేశాడు. ఇటీవల గొర్రెకుంటలో లారీ అసోషియేషన్ ఎన్నికల విషయంలో తలదూర్చి తన అనుచరుడిని అధ్యక్షుడిని చేసేందుకు పలువురు లారీ ఓనర్లపై దాడి చేయించగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇటీవల అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్‌ను రాజకీయ కక్షతో తప్పుడు కేసులో ఇరికించడంలో రౌడీ రాజ్ ప్రధాన పాత్ర పోషించినట్లు తెలిసింది. అయితే ఓ పోలీసు అధికారి డైరెక్షన్‌లోనే మూడు స్టేషన్ల అధికారులు రౌడీ రాజ్ దందాలకు సహకరిస్తూ స్వామి భక్తి ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో ఆ అధికారిపై విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు పంపినా అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం.

### గాడ్‌ఫాదర్ అండతో..

వరంగల్ తూర్పు నియోజవర్గంలో అధికార పార్టీ ముఖ్య నేత రౌడీ రాజ్‌కు గాడ్‌ఫాదర్‌గా ఉన్నాడు. అయితే కొద్ది నెలల క్రితం 'నమస్తే తెలంగాణ'లో అతడి వ్యవహారంపై వరుస కథనాలు ప్రచురితం కావడంతో గన్‌మెన్లను, తుపాకీ లైసెన్స్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. ఆ తర్వాత కొంత కాలం సైలెంట్‌గా ఉన్న ఆ రౌడీ తన గాడ్ ఫాదర్ అండ, పోలీసు అధికారి సహకారంతో మళ్లీ రెచ్చిపోతున్నాడు. ఇటీవలే తన ప్రత్యర్థులను తప్పుడు కేసుల్లో ఇరికించినట్లు ఆరోపణలుండగా వెలుగులోకి రాని భూ సెటిల్‌మెంట్లు, బెదిరింపులు అనేకం. ఇంత జరుగుతున్నా ఆ రౌడీ దందాలు, దౌర్జన్యాలకు చెక్ పెట్టకపోవడం, అతడికి సహకరిస్తున్న పోలీసు అధికారిపై చర్యలు తీసుకోకపోవడంతో ఉన్నతాధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఆ రౌడీ దందాలు, అతడి వెనకున్న ముఖ్య నేతపై ఇద్దరు ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. తూర్పులో జరుగుతున్న పరిణామాలపై ఇంటెలిజెన్స్ వర్గాలు నివేదికలు అందించినా హోం శాఖను చూస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల వరంగల్ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సన్‌ప్రీత్ సింగ్ రౌడీ రాజ్ పోలీసింగ్‌కు చెక్‌పెట్టి, అదుపు తప్పిన శాంతిభద్రతలను కంట్రోల్‌లోకి తీసుకొస్తారా? అనేది వేచి చూడాలి.